ఆంధ్రజ్యోతి
రంజాన్ వేళలు బుధవారం(ఇఫ్తార్-6:37), గురువారం (సహెర్-4:53)
ANDHRAJYOTHY
5

మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
బుధవారం 27 మార్చి 2024


48 గంటలు సైలెన్స్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), మార్చి 26: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఉప ఎన్నిక పోలింగ్ గురువారం ఉన్నందున 48 గంటల సైలెన్స్ పీరియడ్ అమల్లోకి వచ్చిందని కలెక్టర్ జి.రవినాయక్ తెలిపారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి పోలింగ్ జరిగే గురువారం సాయంత్రం నాలుగు గంటల వరకు ఇది అమల్లో ఉంటుందని చెప్పారు. బహిరంగ సభలు, ప్రసంగాలు, హోటళ్లు, హాల్స్‌లలో కలవడం, మద్యం అమ్మకాలు, ఒపీనియన్ పోల్, ఎగ్జిట్ పోల్, మీడియా మాధ్యమాలలో ప్రచారాలు నిషేధమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. బుధ, గురువారాల్లో మద్యం దుకాణాలు బంద్ చేయనున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.



పాలమూరుకు ఫోన్ ట్యాపింగ్ లింకులు

- డీజీపీకి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రస్తావించిన నాయకులు
- గతంలో ప్రత్యేక వార్‌రూం నడిపినట్లు ఆరోపణలు
- విచారణ పరిధిని జిల్లాలకు విస్తరించాలని విన్నపం
- ప్రత్యేక సెల్ ఏర్పాటుతో ఫిర్యాదులు పెరిగే అవకాశం



మహబూబ్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పాలమూరుకు లింకులు ఉన్నాయా?.. గతంలో పలుమార్లు ప్రతిపక్ష నాయకులు చేసిన ఆరోపణలు నిజమేనా?.. ప్రతిపక్ష, ప్రజా సంఘాల నాయకులు, పలువురు సామాజికవేత్త ఫోన్లు నిజంగానే ట్యాపింగ్‌కు గురయ్యాయా? అంటే అవుననే సమాధానాలు ప్రస్తుతం వినిపిస్తున్నాయి. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మొదటి బాధితుడిగా డీజీపీ రవిగుప్తకు మంగళవారం ఫిర్యాదు చేయడం పాలమూరులో కలంకలం రేపుతోంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సీరియస్‌గా ఉంది. ఇప్పటికే ఈ ఘటనలో కీలకమైన ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న తదితరులను అదుపులోకి తీసుకోగా.. ఎస్ఐబీ కన్సల్టెంట్ రవిపాల్‌ను కూడా నిందితుడిగా భావిస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి పాలమూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రితో పాటు పలువురు పోలీసు అధికారులను అనుమానితులుగా భావించి ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం విచారణ రాజధాని హైదరాబాద్‌కు మాత్రమే పరిమితం కాగా.. జిల్లాలకు విస్తృతం చేసి.. ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే డీజీపీని కోరారు. గత ప్రభుత్వంలో మహబూబ్‌నగర్ జిల్లాలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని పలువురు గతంలోనే అనుమానాలు వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంతోపాటు ఇతర సందర్భాల్లోనూ ఈ మేరకు అప్పటి ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ ముఖ్య నాయకులు కూడా ఆరోపణలు చేశారు. కొంతమంది ముఖ్య నాయకుల్లో కూడా ఈ భావన ఉండటంతో అది ఎన్నికల ప్రచారంలో భాగమైంది. ఎస్ఐబీ ఆధ్వర్యంలో హైదరాబాద్ కేంద్రంగా ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి సమీపంలోనే అడ్డా వేసి.. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడగా.. జిల్లాలోనూ ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, సీఎంకు సన్నిహితంగా ఉండే నాయకుల సంభాషణలను విన్నట్లు తెలుస్తోంది. ఈ ట్యాపింగ్ వ్యవహారంపై జిల్లా స్థాయిలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తే మరి కొంతమంది బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. అలాగే నాయకుల్లో ఉన్న అనుమానాలు నివృత్తి అవుతాయనే భావన వారిలో వ్యక్తమవుతోంది.

విచారణ విస్తృతం అయ్యేనా?

తీగ లాగితే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం డొంక కదులుతోంది. ప్రణీత్‌రావు మొదలుకుని.. రవిపాల్ వరకు ఇప్పుడు బయటకు రాగా, రానున్న రోజుల్లో ఈ వ్యవహారంలో చక్రం తిప్పిన మాజీ ప్రజాప్రతినిధులతోపాటు దీనిని తమకు అనుకూలంగా మలుచుకున్న వారి పేర్లు బయటపడే అవకాశం ఉంది. ఫోన్ ట్యాపింగ్‌పై పాలమూరుకు లింకులు ఉన్నట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆధారాలు సమర్పించి, డీజీపీకి ఫిర్యాదు చేయడంతో అది ఎక్కడి వరకు దారి తీస్తుందో వేచిచూడాలి. అయితే రాష్ట్రస్థాయిలోనే కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తుండగా.. జిల్లా స్థాయి వరకు విచారణ పరిధిని విస్తరిస్తారా? అనేది స్పష్టత లేదు. ఒకవేళ విచారణ విస్తృతం చేస్తే మాజీ ప్రజాప్రతినిధుల కాల్ డేటా రికార్డులను పరిశీలించడంతోపాటు.. ప్రస్తుతం అదుపులో ఉన్న నిందితులతో జిల్లాలకు సంబంధించిన కూపీ లాగాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర స్థాయిలో చేసినట్లుగానే జిల్లాలకు కూడా పరికరాలను దిగుమతి చేసుకున్నారా? లేక అక్కడి పరికరాల సాయంతోనే స్థానికంగా సర్వర్లు ఏర్పాటు చేసుకుని నడిపించారా? అనేది తేల్చాల్సి ఉంది. గోప్యత అనేది అందరి ప్రాథమిక హక్కు కాబట్టి.. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గానే ముందుకెళ్లే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

వార్ రూం ద్వారా ట్యాపింగ్?

మహబూబ్‌నగర్ జిల్లాలో ఫోన్ ట్యాపింగ్‌పై చాలా రోజులుగా ఆరోపణలు వినిపిస్తూనే ఉన్నాయి. అప్పటి అధికార పార్టీ నాయకులు ప్రతిపక్ష నాయకుల మాటలు వినడానికి.. వారికి సహరించే వారిని బెదిరించడానికి ఈ ఫోన్ ట్యాపింగ్‌ను ఉపయోగించారనే అనుమానాలు ఉన్నాయి. ప్రత్యేక వార్ రూం ఏర్పాటు చేసి మరీ.. నాయకులను బెదిరించినట్లు ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో మహబూబ్‌నగర్ రూరల్ మండలానికి చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు ఫోన్‌లో మాట్లాడిన సంభాషణ వినడం ద్వారానే ఆయనపై దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అలాగే పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులను సైతం బెదిరించారని తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం నడిపిన పోలీసులు అప్పటి అధికారపక్ష నాయకులకు సహకరించడంతో పాటు వారూ కొంతమందిని స్వయంగా బెదిరించారని సమాచారం. దాంతో పలువురు పాలమూరును వదిలి హైదరాబాద్‌కు వెళ్లి స్థిరపడినట్లు కూడా తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిన తర్వాత తిరిగి కొంతమంది పాలమూరుకు రాగా.. ఇంకా కొంతమంది అక్కడే ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యే ఫిర్యాదు ప్రకారం తన నెంబర్‌తోపాటు తన సమీప వ్యక్తుల ఫోన్లను ట్యాప్ చేశారని తెలుస్తోంది. అలాగే ఆయనకు సహకరించే వ్యాపారులు, సమీప బంధువులను కూడా బెదిరించారని సమాచారం. అందులో ఓ మాజీ మంత్రి పాత్రతో పాటు కొందరు పోలీసు అధికారులు ఉన్నారని పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వార్ రూం ద్వారా రోజూ సంభాషణలు వింటూ.. ఎవరిని ఎలా కట్టడి చేయాలో ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని ఎమ్మెల్యే ఫిర్యాదులో తెలిపారు.



అమ్మ ఆదర్శ కమిటీలు

- ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీల స్థానంలో ఏర్పాటు
- మహిళా సంఘాల సభ్యులకు బాధ్యతలు
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో ఆలస్యం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,378 గవర్నమెంట్ స్కూల్స్


గండీడ్ మండలం నంచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మార్చి 26: ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ కోసం గతంలో ఉన్న ఎస్ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు)లను ప్రభుత్వం ఇటీవల రద్దు చేసింది. వాటి స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు వారం కింద రాష్ట్ర విద్యా శాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. దాంతో ఉమ్మడి జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటుకు విద్యా శాఖ చర్యలు చేపట్టింది. ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,378 పాఠశాలల్లో ఈ కమిటీలు కొలువుదీరనున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో నిధుల వినియోగానికి ప్రధానోపాధ్యాయుడు, సీనియర్ ఉపాధ్యాయుడు, ఏకోపాధ్యాయ పాఠశాలల్లో కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు డ్రా చేసేందుకు చెక్ పవర్ కల్పించింది.

మహిళా సంఘాలకే పాఠశాల బాధ్యత

ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల పర్యవేక్షణలో మహిళా సంఘాల సభ్యులను భాగస్వామ్యం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మౌలిక వసతుల పర్యవేక్షణ, నిర్వహణ బాధ్యతలను వీరికి అప్పగించేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ కమిటీలను ఎంఏఎంటీ సాఫ్ట్‌వేర్‌తో ఆన్‌లైన్‌లో కలెక్టర్, డీఈవోలు, ప్రధానోపాధ్యాయులు, సాంకేతిక సంస్థల అధికారులు పర్యవేక్షించనున్నారు.

ముగ్గురు సభ్యులు

పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థుల తల్లులు ముగ్గురిని సభ్యులుగా తీసుకుంటారు. వీరు మహిళా సమాఖ్య సభ్యులై ఉండాలి. ముగ్గురిలో ఒకరు ఎస్సీ లేదా ఎస్టీ అయ్యి ఉండాలి. స్కూల్‌కు సమీపంలోని మహిళా సమాఖ్య అధ్యక్షురాలిని కమిటీ అధ్యక్షురాలిగా నియమిస్తారు. కమిటీ అధ్యక్షురాలికి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి కలిపి బ్యాంకు ఖాతా తెరిచి, ఉమ్మడి చెక్ పవర్ కల్పిస్తారు. ఏటా రొటేషన్ ప్రాతిపదికన కమిటీలను నియమిస్తారు.

అన్ని బాధ్యతలు ఈ కమిటీలకే

పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం, పారిశుధ్య పనులు, యూనిఫాం కుట్టు బాధ్యతలను అమ్మ ఆదర్శ కమిటీలు పర్యవేక్షిస్తాయి. పనుల కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ప్రత్యేక అభివృద్ధి నిధులతో పాటు ఇతర సంస్థల నుంచి వచ్చే వాటిని వెచ్చించాలని నిర్ణయించారు. నిర్వహణ, పర్యవేక్షణకు సంబంధించి ఆయా పనుల విలువలో మూడు శాతం సేవా రుసుముల కింద కమిటీలకు చెల్లించాలని సూచించారు. అత్యవసర పనులను వచ్చే జూన్ 10 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

రూ.25 వేలు మించితేనే టెండర్

పాఠశాలల్లో అభివృద్ధి పనులు రూ.25 వేలు, అంతకంటే తక్కువ వ్యయంతో చేపడితే పాఠశాల కమిటీ తీర్మానంతో చేసుకోవచ్చు. అంతకంటే ఎక్కువ వ్యయంతో చేపట్టాల్సి ఉంటే కమిటీలు జిల్లా సమాఖ్యల ద్వారా కలెక్టర్‌కు నివేదించాలి. ఏఈ, డిప్యూటీ ఈఈలు పనుల రికార్డును ఎంబీలలో నమోదు చేయాలి. పనుల వ్యయం రూ.లక్ష దాటితే కలెక్టర్ చెల్లింపులు చేస్తారు. సామాజిక తనిఖీలు కూడా నిర్వహిస్తారు.

కోడ్‌తో ఏర్పాటు ఆలస్యం



ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండటంతో అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటు ఆలస్యం అవుతోంది. కమిటీల ఏర్పాటుకు ఇప్పటికే విధివిధానాలు వచ్చాయి. కోడ్ ముగిసిన వెంటనే పాఠశాలల్లో కమిటీలను ఏర్పాటు చేస్తాం.

- ఏ.రవీందర్
మహబూబ్‌నగర్ డీఈవో

ఆదివాసి సాహిత్యాన్ని వెలుగులోకి తేవాలి

- ప్రొఫెసర్ డేనియాల్ నిగ్రెస్


ప్రొఫెసర్ డేనియల్ నిగ్రెస్ సన్మానిస్తున్న పీయూ అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, మార్చి 26: ఆదివాసీ తెగల సాహిత్యం కనుమరుగు అవుతోందని, ఆ సాహిత్యాన్ని కాపాడేలా సాహితీ వేత్తలు, పరిశోధకులు కృషి చేయాలని ఫ్రాన్స్ దేశానికి చెందిన ప్రొఫెసర్ డేనియల్ నిగ్రెస్ అన్నారు. సాహిత్యంలో వైవిధ్యం కొనసాగేందుకు పరిశోధకులు కృషి చేయాలని కోరారు. పాలమూరు యూనివర్సిటీలోని అకాడమిక్ భవనంలో ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో నాల్గో ప్రపంచ సాహిత్యం అంశంపై మంగళవారం ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డేనియల్ నిగ్రెస్ ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డేనియల్ నిగ్రెస్, రిటైర్డ్ ప్రొఫెసర్ తిరుమలరావు మాట్లాడుతూ చెంచు, కోయ, గొండు వంటి ఆదివాసీ తెగలతో పాటు సంచార జాతుల మూలవాసుల సాహిత్యం, కళలు క్రమంగా అంతరిస్తున్నాయని గుర్తు చేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ గూడురు మనోజ చొరవతో పాలమూరు ఉమ్మడి జిల్లా ఆదివాసీ, మూలవాసీల సాహిత్యం, కళలపై పరిశోధనలు కొనసాగుతున్నాయని చెప్పారు. అంతకు ముందు గూడురు మనోజ మాట్లాడుతూ అంతరించిపోతున్న ఆదివాసీల సాహిత్యాన్ని కాపాడాలన్నారు. అనంతరం ఆదివాసీల ఆట, పాట నృత్యం, సాహిత్యానికి చెందిన వస్తువులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఇఫ్లూ, బీవీఎస్ పీయూ అసోషియేట్ ప్రొఫెసర్ రాజు నాయక్, పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ రాజ్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.కృష్ణయ్య ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ కుమార స్వామి, రిటైర్డ్ ప్రొఫెసర్ గూడురు మనోజ, ఇంగ్లీష్ విభాగాధిపతి డాక్టర్ మాలవి తదితరులు పాల్గొన్నారు.


జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

జడ్చర్ల(మహబూబ్‌నగర్): జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ లాంగ్వేజెస్ సంయుక్త ఆధ్వర్యంలో 'సాహిత్యం-సంస్కృతి' అంశంపై మంగళవారం ఒక్క రోజు అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సామాజిక మానవ శాస్త్రవేత్త, ప్యారిస్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డానియల్ నిగ్రెస్ ప్రారంభించారు. ఆద్యకళా మ్యూజియం ఫౌండర్, ట్రస్టీ ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, సభ్యులు ప్రొఫెసర్ గూడూరు మనోజ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డానియల్ నిగ్రెస్ మాట్లాడుతూ 40 యేళ్ల తెలుగు సాహిత్య సంస్కృతులు-పరిశోధన అధ్యయనంపై వివరించారు. అనంతరం జయధీర్ తిరుమలరావు, గూడూరు మనోజ మాట్లాడారు.

అప్పు చెల్లించలేక ఆత్మహత్యాయత్నం

ఊర్కొండ, మార్చి 26 : తీసుకున్న అప్పు తిరిగి చెల్లించలేక ఓ వ్యక్తి గొంతు, చేతులు కోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన మంగళవారం నాగర్‌కర్నూలు జిల్లా ఊర్కొండ మండ కేంద్రం శివారులో చోటుచేసుకున్నది. స్థానికులు, ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం ఆమనగల్లుకు చెందిన దుర్గేష్ ఏడు సంవత్సరాల నుంచి ఆమనగల్లు పట్టణంలో ఫొటోఫ్రేమ్ వర్క్ చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. తన అవసరాల కోసం ఒకరి వద్ద అప్పుగా రూ. 30 వేలు తీసుకున్నాడు. ఆ అప్పు తీర్చే క్రమంలో మరొకరి వద్ద అప్పు తీసుకున్నాడు. అప్పు ఇచ్చిన వారి కుటుంబంలో వివాహం ఉండటంతో అప్పు తిరిగి చెల్లించలేక పోతున్నానని మనస్తాపం చెందాడు. ఊర్కొండ-ఊర్కొండపేట మార్గంమధ్యలో ఉన్న గుట్టలోకి వెళ్లి గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. గొంతుకైన గాయం బాధకు తాళలేక రోడ్డుపైకి వచ్చి కేకలు వేస్తూ కిందపడిపోయాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని అతడిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తూ బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

పడిపోతున్న జలం


భూగర్భ జలాలు పడిపోవడంతో నీటిని సన్నటి ధారగా పోస్తున్న బోరు

- జోగులాంబ గద్వాల జిల్లాలో తగ్గుతున్న భూగర్భ జలాలు
- బోర్లు, బావులలో తగ్గిన నీరు
- నీరందక ఎండుతున్న పైర్లు
- దిగుబడిపై తీవ్ర ప్రభావం


కేటీదొడ్డిలో నీళ్లందక ఎండిపోయిన వరి పైరు


గద్వాల సమీపంలో నీళ్లందక ఎండిపోతున్న చినీ తోట

గద్వాల, మార్చి 26: జోగుళాంబ గద్వాల జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో సగటున 8.28 మీటర్ల లోతులో జలాలు ఉన్నాయి. ఉండవెల్లి మండలం కంచుపాడులో 22.59 మీటర్ల లోతులో, ధరూర్ మండలం మార్లబీడులో 26.84, కేటీదొడ్డిలో 22.14, ఇటిక్యాల మండలం మునగాలలో 26.49 మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు పడిపోయాయి. నడిగడ్డలో ఈ పరిస్థితి 2019 తర్వాత ఇప్పుడే చోటు చేసుకున్నది. జూరాల, నెట్టంపాడు, ఆర్డీఎస్ ప్రాజెక్టుల పరివాహక ప్రాంతాలలో వానాకాలం, యాసంగిలో నీరు పారుతుండటంతో ఇతర జిల్లాలతో పోల్చుకుంటే జిల్లాలో భూగర్భ జలాలు పైనే ఉండేవి. కానీ ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రాజెక్టులలో నీళ్లు లేవు. యాసంగి పంటకు విరామం ఇవ్వడంతో గ్రావిటీ ద్వారా నీరు పారడం లేదు. దాంతో ఆ ప్రభావం భూగర్భ జలంపై పడి, గంగ పడిపోతోంది. బోర్లు, బావులను నమ్ముకొని పంటలు సాగు చేయగా.. ఇప్పుడు బోర్లు నీళ్లు పోయడం లేదు. దాంతో పంటలు ఎండిపోతున్నాయి. ఈ పరిస్థితిని ముందే గమనించి రైతులకు అవగాహన కల్పించి ఉంటే వారు నష్టపోయేవారు కాదు.

భూగర్భ జలాలు ఇలా..

జిల్లాలో భూగర్భ జల్లాలు సగటున 8.28 మీటర్ల లోతులో ఉన్నాయి. తొమ్మిది మండలాల్లో ఉండాల్సిన లోతుకంటే ఎక్కువగా పడిపోయాయి. నాలుగు మండలాల్లో మరీ ఎక్కువ పడిపోయాయి. ఉండవెల్లిలో 11.93 మీటర్ల లోతుకు నీళ్లు పడిపోయాయి. కేటీదొడ్డిలో 10.57, గట్టులో 8.42, అలంపూర్‌లో 8.16, ధరూర్‌లో 7.41 మీటర్ల లోతుకు జలాలు తగ్గాయి. గత జనవరితో పోల్చుకుంటే ఫిబ్రవరికి రెండు మీటర్ల లోతుకు నీరు తగ్గింది. ఈ మార్చిలో మరింత తగ్గింది. ఏప్రిల్‌లో ఇంకా పడిపోయి, మేలో వ్యవసాయానికి నీటి వాడకం తగ్గనున్నందున ఆ నెలలో పెరిగే అవకాశం ఉంది. అప్పటి వరకు భూగర్భ జలాలను పొదుపుగా వాడుకుంటేనే అటు వ్యవసాయానికి, ఇటు తాగునీటికి ఇబ్బందులు ఉండవు.

దిగుబడిపై ప్రభావం

జూరాల, నెట్టంపాడు ప్రాజెక్టుల కింద ఈ ఏడాది యాసంగి సాగుకు క్రాప్ హాలిడే ప్రకటించడంతో గద్వాల, ధరూర్, కేటీదొడ్డి, మల్దకల్, అయిజ, ఇటిక్యాల మండలాల రైతులు బోర్లు, బావులను నమ్ముకొని దాదాపు 35 వేల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ముఖ్యంగా వరి, వేరుశనగతో పాటు ఇతర పంటలను వేశారు. విత్తనాలు వేసే సమయంలో బోర్లు, బావులలో నీటి లభ్యత ఎక్కువగా ఉండటంతో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. ఇప్పుడు చేతికందాల్సిన సమయంలో వాటిలో నీటి నిల్వలు పడిపోయాయి. ఫలితంగా వేసిన పంటకు నీరందక రైతులు నానాతంటాలు పడుతున్నారు. కొంత మంది కొంత భాగం పంటను వదిలేసి, మిగిలినది కాపాడుకుంటున్నారు. పండ్ల తోటల రైతుల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. తోటలు ఎండుతుండటంతో దిక్కు తోచని స్థితిలో పడ్డారు. ఉన్న నీటిని విడతల వారీగా తడుపుతున్నారు. నీరు సరిగా లేకపోవడంతో దిగుబడిపై ప్రభావం పడుతోంది.

జాతీయ రహదారిపై ప్రమాదం

- శివంపేట శివారులో కారును ఢీకొట్టిన టిప్పర్
- పలువురికి గాయాలు

పుల్‌కల్, మార్చి 26: సంగారెడ్డి-నాందేడ్, అకోలా-161 జాతీయ రహదారిపై చౌటకూర్ మండలం శివంపేట గ్రామ శివారులో మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కారులో ఐదుగురు నాందేడ్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో శివంపేట మూల మలుపునకు సమీపంలో వెనుక వైపు నుంచి అతి వేగంగా వచ్చిన టిప్పర్ కారును ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న కే.వేణుతో పాటు, మరో నలుగురు యువకులకు గాయాలయ్యాయి. కారును టిప్పర్ బలంగా ఢీకొట్టడంతో కారు డివైడర్ రోడ్డు మధ్యలో నాటిన పూల మొక్కల్లోకి ఎగిరిపడి పల్టీ కొట్టింది. ప్రమాద దాటికి కారు అద్దాలు, డోర్‌లు ధ్వంసమయ్యాయి. విషయం తెలుసుకున్న ఎన్‌హెచ్ఏఐ తాడ్దానిపల్లి టోల్‌ప్లాజా అంబులెన్స్‌తో పాటు, 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగ్రాతులను బయటకు తీశారు. గాయపడిన వారిని వెంటనే సంగారెడ్డిలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించడంతో రెస్క్యూ సిబ్బంది వాహనాలను క్రమబద్ధీకరించారు. డివైడర్ మధ్యలో కూరుకుపోయిన కారును క్రేన్ సహాయంతో బయటకు తీసి టోల్‌ప్లాజా వద్దకు తరలించారు. ఈ విషయమై పుల్కల్ పోలీసులకు సమాచారం అందించారు.


జాతీయ రహదారిపై పల్టీ కొట్టిన కారు



కారును ఢీకొట్టిన టిప్పర్

కానిస్టేబుల్‌పై దాడి, కేసు నమోదు

ధరూరు, మార్చి 26 : జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ గోవిందుపై వామన్‌పల్లి గ్రామానికి చెందిన ఎనిమిది మంది యువకులు దాడి చేసిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది.

హెడ్‌కానిస్టేబుల్ హుసేన్ తెలిపిన వివరాల ప్రకారం.. కానిస్టేబుల్ గోవిందు సోమవారం విధుల నిమిత్తం మండలంలోని నీలహళ్లి గ్రామానికి వెళ్లాడు. విధులు ముగించుకుని తిరిగి పోలీస్‌స్టేషన్‌కు వెళుతున్న సమయంలో మార్గమధ్యలో వామన్‌పల్లి గ్రామానికి చెందిన ఎనిమిది మంది యువకులు కానిస్టేబుల్‌ను ఆటకాయించారు. హోలీ పండుగ సందర్భంగా తమకు డబ్బులు ఇవ్వాలని యువకులు కానిస్టేబుల్‌తో వాగ్వాదానికి దిగారు. తాను కానిస్టేబుల్‌నని చెప్పినా వినకుండా బైక్‌ను తోసేసి యువకులు దాడికి పాల్పడ్డారు. దీంతో గోవిందు విషయాన్ని పోలీస్‌స్టేషన్‌కు తెలిపాడు. స్టేషన్‌లో కానిస్టేబుల్ గోవిందు ఫిర్యాదు మేరకు ఎనిమిది యువకులపై మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ హుసేన్ తెలిపారు.

ఎడమ కాలువ పరిసర ప్రాంతాల్లో

ఎండుతున్న వరి



మొట్లంపల్లి శివారులో ఎండిన వరి పంట

ఆత్మకూరు, మార్చి 26 : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ పరిసర ప్రాంతాల్లో సాగు చేసిన వరి నీరు లేక ఎండుతున్నాయి. రైతులు పంటలను బతికించుకోవడానికి భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. గత ఏడాది మాదిరిగానే ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తారని ఆశించి కాలువ పరిసర ప్రాంతాల్లో మోటార్లు అందుబాటులో ఉన్న రైతులు వరి పంటను సాగు చేశారు. మరో 20 రోజులు గడిస్తే పంటలు చేతికొచ్చే సమయంలో ఎడమ కాలువ ద్వారా పూర్తిగా నీటిని నిలిపివేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సమాంతర కాలువ ద్వారా రెండురోజుల క్రితం దిగువకు నీటిని విడుదల చేశారు. అదే మాదిరిగానే ఎడమకాలువ ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తే పరిసర ప్రాంతాల రైతులు మోటార్ల ద్వారా పంటలను బతికించుకునే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రాజెక్టు అధికారులు స్పందించి రెండు ఫీట్ల మేర ఎడమకాలువ ద్వారా 20రోజుల పాటు నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.



పూర్తిగా ఎండిపోయిన ఎడమ కాలువ

గ్రామ కంఠం అక్రమార్కులకు ధారాదత్తం

» విచారణకు ఆదేశించిన కలెక్టర్
» రాజకీయ జోక్యంతో ఆగిన విచారణ

అంతరాష్ట్ర రహదారిపై ఉన్న గ్రామం. ఒక్కో ప్లాటు లక్షల్లో ధర పలుకుతుంది. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు అక్రమార్కులు గ్రామ కంఠంలోని భూమిని ప్లాట్లు చేశారు. పంచాయతీ అధికారులతో కుమ్మక్కై యాజమాన్య పత్రాలు పుట్టించి ఇళ్లు నిర్మిస్తున్నారు. పదిరోజుల క్రితం గ్రామానికి వచ్చిన కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశించారు. రాజకీయ జోక్యంతో విచారణ నిలిచిపోయింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

గద్వాల, మార్చి 26 : జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలోని గోనుపాడు గ్రామం జిల్లా కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో అంతరాష్ట్ర రహదారిపై ఉంటుంది. ఈ గ్రామంలోనే పాలిటెక్నిక్ కళాశాల, కస్తూర్బాగాంధీ విద్యాలయంతో పాటు, గద్వాల నుంచి గ్రామం వరకు రియల్ ఎస్టేట్ వ్యాపారం విస్తరించి ఉంది. దీంతో అక్కడ భూములు, ప్లాట్లకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఒక్కో ప్లాట్లు లక్షల్లో ధర పలుకుతుంది. అయితే గ్రామంలో గ్రామ కంఠం 25 గుంటల భూమి ఏళ్ల తరబడి ఖాళీగా ఉంది. దీని ధర సుమారు రూ.70 లక్షలు దాకా ఉంటుంది. ఈ భూమి తమదేనని కొందరు సాదాకాగితంపై ఓ మాజీ ప్రజాప్రతినిధి అనుచరులకు విక్రయించారు. దీనిపై అప్పట్లోనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు, స్థలాన్ని చదును చేసేటప్పుడు గ్రామస్థులు అడ్డుకున్నారు. కానీ అప్పటి ప్రభుత్వంలోని నాయకుల అండదండలతో గ్రామ కంఠం భూమి కాదని పంచాయతీలో తీర్మానం చేశారు. ఆ వెంటనే ప్లాట్లు చేసి విక్రయించారు. ఇక్కడి వరకు ఆ భూమికి ఎలాంటి చట్టబద్ధత లేదు. కానీ ప్లాట్లు కొనుగోలు చేసిన వారు పంచాయతీ అధికారులతో కుమ్మక్కై యాజమాన్య పత్రం(పొజిషన్)ను జారీ చేయించుకున్నారు. ఈ పత్రం సహాయంతో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో చట్టబద్ధత పొందారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు.. విచారణకు ఆదేశం

గ్రామ కంఠం భూమికి పంచాయతీ అధికారులు యాజమాన్య పత్రాలు జారీ చేయడంపై గ్రామస్థులు పదిరోజుల క్రితం గ్రామానికి వెళ్లిన కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ విచారణ చేయాలని మండల పరిషత్ అధికారులను ఆదేశించారు. కానీ నేటివరకు పరిషత్ అధికారులు విచారణకు వెళ్లడం లేదు. రాజకీయ జోక్యంతో వారు వెళ్లడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, యాజమాన్య పత్రాలను 2021 నుంచి పంచాయతీ కార్యదర్శులు జారీ చేయడానికి వీలు లేదు. అందుకే పంచాయతీ కార్యదర్శి కోర్టు తీర్పుకు ముందు తేదీ ఇచ్చి పత్రాలను జారీ చేశాడు. వాస్తవంగా అక్కడ ఇళ్లు, గుడిసెలు ఉంటేనే ఈ పత్రాలను జారీ చేయాలి. ఖాళీ స్థలాలకు యాజమాన్య పత్రాలు ఇవ్వకూడదు. కానీ అక్కడ ఉన్నట్లు అసెస్‌మెంటు నెంబర్లు క్రియేట్ చేసి జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇవన్నీ విచారణలో బహిర్గతం అవుతాయి. అధికారులు వెంటనే విచారణ నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కాగా, ఈ విషయంపై అప్పటి పంచాయతీ కార్యదర్శి శివన్నను వివరణ కోరగా పత్రాలు ఇచ్చిన మాట వాస్తవమేనని తెలిపారు. కొనుగోలు చేసినట్లు బాండ్లు, పంచాయతీ తీర్మానం ఉండడంతో జారీ చేశానని వివరించారు.


గ్రామ కంఠంలో నిర్మాణమవుతున్న ఇళ్లు

విచారణ చేస్తాం : చెన్నయ్య, ఎంపీవో, గద్వాల

గ్రామ కంఠం భూమికి యాజమాన్య పత్రాలు ఇవ్వడంపై గ్రామస్థుల ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సెలవులు ఉండటంతో విచారణ చేయలేదు. త్వరలో విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు అందిస్తాం.

బాధను దిగమింగి 'పది' పరీక్ష రాసిన విద్యార్థిని

» మనోధైర్యాన్ని నింపిన బంధువులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు
» పరీక్ష అనంతరం తండ్రి అంత్యక్రియలకు హాజరు


బాధను దిగమింగి పరీక్షకు హాజరైన పావని

చారకొండ, మార్చి 26 : తండ్రి చనిపోయిన బాధను దిగమింగి ఆ కూతురు 'పది' పరీక్షలకు హాజరైంది. వివరాల్లోకి వెళితే.. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం జూపల్లి గ్రామానికి చెందిన కడారి తిరుపతయ్యకు ఐదురోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం ఆయన మృతి చెందాడు. తండ్రిని కోల్పోయిన కూతురు పావని పుట్టెడు దుఃఖంతో బాధను దిగమింగి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రానికి హాజరైంది. బంధువులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు పావనికి మనోధైర్యం చెప్పి మంగళవారం జరిగిన ఫిజికల్ సైన్స్ పరీక్ష రాసేందుకు ఒప్పించారు. దీంతో పావని పరీక్ష రాసి మధ్యాహ్నం ఇంటికి వచ్చి తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నది.

ఐదుగురి బైండోవర్

హన్వాడ, మార్చి 26 : మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని షేక్‌పల్లి గ్రామంలో రోడ్డు విషయంలో జరిగిన గొడవలో ఐదు మందిని పోలీసులు మంగళవారం తహసీల్దార్ కిష్ట్యానాయక్ ముందు బైండోవర్ చేశారు. మళ్లీ గొడవలకు పాల్పడవద్దని, పాల్పడితే లక్ష రూపాయలు జరిమానా చెల్లించాలని తహసీల్దార్ వారిని హెచ్చరించారు.

తీర్థావళితో ముగిసిన రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

అడ్డాకుల, మార్చి 26 : మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం కందూరు గ్రామంలో గత వారంరోజులుగా నిర్వహిస్తున్న రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం తీర్థావళితో ముగిశాయి. ఆలయ అర్చకులు ఉదయం దేవాలయంలో గవ్యాంతం, నిత్యోపాసన, రుద్రహోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కందూరు గ్రామం నుంచి భక్తులు రంగునీళ్ల కుండలతో హోలీ వేడుకలు నిర్వహిస్తూ దేవాలయానికి చేరుకున్నారు. కోనేరులో భక్తులు, అర్చకులు ఉత్సవ విగ్రహాలకు, త్రిశూలంకు పూజలు నిర్వహించి త్రిశూలస్నానం కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను, త్రిశూలాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. దాంతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు పూజారులు తెలిపారు. కాగా, శ్రీరామనవమి వరకు జాతర నిర్వహించడానికి ఉత్సవ కమిటీ సభ్యులు, ఎండోమెంటు అధికారులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఈవో రాజేశ్వరశర్మ, సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


కోనేరులో త్రిశూల స్నాన కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు

మద్యం బాటిళ్లు పట్టివేత

నవాబ్‌పేట(మహబూబ్‌నగర్), మార్చి 26 : అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై అభిషేక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నవాబ్‌పేట మండలంలోని సిద్దోటం గ్రామంలో రాజు, రవి అనే వ్యక్తులు కొంతకాలంగా అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నారు. తమకందిన సమాచారంతో గ్రామంలో తనిఖీ చేయగా వారి వద్ద 11.10 లీటర్ల మద్యం బాటిళ్లు సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్దూర్‌లో 62.634 లీటర్ల మద్యం పట్టివేత

మద్దూర్ : మద్దూర్ మండలంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 62.634 లీటర్ల మద్యం పట్టుబడింది. ఎస్సై రాంలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్దూర్‌కు చెందిన భాస్కర్‌గౌడ్ మద్దూర్ నుంచి నాగిరెడ్డిపల్లికి ఆటోలో అక్రమంగా మద్యం తరలిస్తున్నాడు. నాగిరెడ్డిపల్లి శివారులో ఆటోను తనిఖీ చేయగా 23.43 లీటర్ల లిక్కర్, అలాగే దోరేపల్లికి చెందిన మరోవ్యక్తి నరేష్‌గౌడ్ ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న 39.204 లీటర్ల లిక్కర్‌ను పట్టుకున్నారు. పట్టుకున్న మద్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమంగా మద్యం తరలిస్తున్న ఆ ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.


మద్దూర్‌లో టాస్క్‌ఫోర్స్ నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన మద్యం


బాలానగర్‌లో పట్టుబడిన నగదు


చిన్నపొర్లలో పోలీసులు పట్టుకున్న మద్యం కాటన్లు

చిన్నపొర్లలో ...

ఊట్కూర్ : నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం చిన్నపొర్ల గ్రామంలో మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. దాడుల్లో 39.36 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. ఎస్సై బి.శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రంగం రవి అనే యువకుడు తన కిరాణం షాప్‌లో మద్యం అమ్ముతున్నాడనే పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. దాడుల్లో రూ.20,091 విలువ గల 39.36 లీటర్ల మద్యం బాటిళ్లు పట్టుకొని ఊట్కూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా అక్రమంగా మద్యం అమ్ముతున్న రంగం రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలానగర్‌లో పట్టుబడిన నగదు

బాలానగర్ : ఎన్నికల్లో భాగంగా చేపట్టిన తనిఖీల్లో నగదు పట్టుబడింది. ఎస్సై తిరుపాజీ తెలిపిన వివరాల ప్రకారం.. బాలానగర్ మండల కేంద్రంలో మంగళవారం వాహనాల తనిఖీ చేపడుతుండగా అనంతపురం జిల్లా కరిగానిపల్లికి చెందిన మాలరామూర్తి వద్ద రూ.లక్ష, కిష్టప్ప అనే వ్యక్తి వద్ద రూ.64 వేలు, నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం బావాజీపల్లి గ్రామానికి చెందిన ఎండీ.సలీం వద్ద రూ.54 వేల నగదు లభించినట్లు ఎస్సై వివరించారు. పట్టుబడిన నగదును కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామని తెలిపారు. నగదుకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు తీసుకొచ్చి చూపిస్తే తిరిగి అందిస్తామని పేర్కొన్నారు. తనిఖీల్లో కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి, అక్బర్, గణేష్, గోపాల్, గౌస్‌బాషా, హోంగార్డు బాలరాజు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

» ఏడు నెలలుగా కేంద్రాలకు చెల్లించని కిరాయి
» జిల్లాలో 589 కేంద్రాలు
» వసతుల లేమితో ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, సిబ్బంది

అద్దె భవనాలకు బిల్లులు రానిది వాస్తవమే..



జిల్లాలో 127 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. భవనాలకు ఏడు నెలల నుంచి అద్దె డబ్బులు రానిది వాస్తవమే. సంబంధిత అధికారులకు గతంలోనే నివేదిక పంపించాం. బిల్లులు వచ్చిన వెంటనే అద్దె భవనాలకు కిరాయి చెల్లిస్తాం.

\- లక్ష్మీబాయి, జిల్లా వెల్ఫేర్ సంక్షేమ అధికారి

వనపర్తి రూరల్, మార్చి 26 : అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కరువయ్యాయి. అరకొర వసతుల నడుమ అద్దె భవనాల్లో పలు కేంద్రాలు కొనసాగుతున్నాయి. వనపర్తి జిల్లాలో 589 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటి పరిధిలో మూడు ప్రాజెక్టులు ఉన్నాయి. వీటిలో 127 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దె ఇళ్లల్లో వసతులు సరిగ్గా లేకపోవడంతో టీచర్లు, సిబ్బంది పడరాని పాట్లు పడుతున్నారు. వనపర్తి జిల్లాలో 589 అంగన్‌వాడీ కేంద్రాలు, మూడు ప్రాజెక్టులు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ఏడు నెలలలోపు చిన్నారులు 2,932 మంది, ఏడు నెలల నుంచి సంవత్సరం లోపు చిన్నారులు 3,552 మంది, సంవత్సరం నుంచి మూడేళ్లలోపు చిన్నారులు 12,264 మంది, మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 11,072 మందితో మొత్తం కలిపి 29,820 మంది చిన్నారులు ఉన్నారు. ఇక గర్భిణులు 3,100, బాలింతలు 2,908 మంది ఉన్నారు. 589 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను 127 అద్దె భవనాల్లో, 214 సొంత భవనాల్లో, మిగతా కేంద్రాలు గ్రామాల్లోని ప్రైమరీ పాఠశాలల్లో ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అద్దె చెల్లించే కేంద్రాలకు శానిటేషన్, నీటి సదుపాయం, 500 గజాల స్థలం కలిగి ఉండాలి. రెండు గదులతో పాటు, కిచెన్ రూమ్ వేరుగా ఉండాలి. గత ఏడు నెలల నుంచి అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సకాలంలో బిల్లులు రాకపోగా పెండింగ్‌లో ఉండడంతో టీచర్లు ఇంటి యజమానులకు సమాధానం చెప్పలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు టీచర్లు చేసేదేమీ లేక సొంత డబ్బులు చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అద్దె భవనాల బిల్లులు చెల్లించాలని అంగన్‌వాడీ టీచర్లు వేడుకుంటున్నారు.


పెద్దగూడెం గ్రామంలో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

ఫింగర్ ప్రింట్ విభాగం రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ భారతి మృతి

» తీర్థయాత్రలో ఫుడ్ పాయిజన్


భారతిరాంరెడ్డి(ఫైల్)

జడ్చర్ల(మహబూబ్‌నగర్), మార్చి 26 : పోలీస్‌శాఖలోని ఫింగర్‌ప్రింట్ విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి, రిటైర్డ్ అయిన భారతిరాంరెడ్డి సోమవారం రాత్రి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోకు సమీపంలోని సీతాపురం మండలం జన్‌పత్ గ్రామంలో మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భార్యాభర్తలు డాక్టర్ రాంరెడ్డి, భారతితో పాటు ఇద్దరు మనుమడులతో కలిసి అయోధ్యకు వెళ్లేందుకు సోమవారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి లక్నోకు వెళ్లారు. లక్నో నుంచి యాత్ర స్థలాన్ని సందర్శించడానికి బయలుదేరిన వీరు రెండు గంటల ప్రయాణం అనంతరం సీతాపురం మండల జన్‌పత్ గ్రామం వద్ద ఓ హోటల్‌లో తిన్నారు. అదే సందర్భంలో భారతి తీవ్ర అస్వస్థతకు గురయ్యింది. దీంతో ఆమెను జనపత్ గ్రామంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు అందించారు. అనంతరం అదే గ్రామంలోని ఓ లాడ్జీలో బస చేశారు. కాగా తీవ్ర అస్వస్థతకు గురైన భారతి అర్ధరాత్రి మృతి చెందిందని తెలిపారు. జడ్చర్ల లయన్స్‌క్లబ్ ఏర్పాటులో భర్త డాక్టర్ రాంరెడ్డితో పాటు భారతిరాంరెడ్డిది కీలకపాత్ర ఉందని లయన్స్‌క్లబ్ సభ్యులు తెలిపారు. జడ్చర్ల పట్టణంలో ప్రైవేట్ నర్సింగ్ కళాశాలను నిర్వహిస్తున్న ఆమె పలు సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. కాగా, భారతిరాంరెడ్డి మృతదేహం బుధవారం జడ్చర్లకు రానున్నదని కుటుంబ సభ్యులు తెలిపారు.

కోనేరులో పడి మహిళ మృతి

హన్వాడ, మార్చి 26 : దేవునికి మొక్కు తీర్చుకునేం దుకు వెళ్లి కోనేరులో పడి మహిళ అనంతలోకానికి వెళ్లిన సంఘటన మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని మాదారంగుట్టపై ఉన్న రాక మకొండ దేవాలయం వద్ద చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన ఉపనగట్టి బాలమణి(45) తన ఇద్దరు కుమార్తెలతో కలిసి సోమవారం మాదారంగుట్టపై ఉన్న రాకమకొండ దేవాలయం జాతరకు వెళ్లింది. మంగళవారం తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో దేవాలయం వద్ద ఉన్న కోనేరులో స్నానం చేసేందుకు కూతురితో కలిసి వెళ్లింది. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో మునిగిపోయింది. గమనించిన కూతురు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు నీటిలో మునిగి ఆమెను బయటకు తీసేలోపు మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు ఉండగా ఇద్దరికి పెళ్లిళ్లు అయ్యాయి. మృతురాలి భర్త కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేట విషయంలో దాడి, కేసు నమోదు

ఉప్పునుంతల, మార్చి 26 : చేపల వేట విషయంలో ఇద్దరిపై దాడి చేసిన మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై సుజ్ఞానం తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం వెల్టూరు గ్రామంలో గ్రామ ముదిరాజ్ సమష్టి భాగస్వామ్యంతో చెరువులో చేప పిల్లలను పెంచారు. కాగా, చెరువు వద్ద చేపల కాపలాగా పోలం కాశన్నను నియమించారు. మంగళవారం ఉదయం అదే గ్రామానికి చెందిన గోర్ల జంగయ్య, గోర్ల రాజు ఇద్దరూ చెరువులో అక్రమంగా చేపల వేటకు వెళ్లారు. విషయం తెలుసుకున్న పోలం శివ, గోర్ల మల్లేష్‌లు చెరువు వద్దకు చేరుకొని చేపలెందుకు పడుతున్నారని వారిని ప్రశ్నించారు. దీంతో గోర్ల జంగయ్య నానా బూతులు తిడుతూ శివపై ఇనుప సీకుతో దాడి చేశాడు. దాడిలో శివ చేతులకు గాయాలయ్యాయి. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు జంగయ్య, రాజులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

వేటగాళ్లకు జరిమానా

వెల్దండ, మార్చి 26 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం దుబ్బతండా సమీపంలో సోమవారం సాయంత్రం వేటకు వచ్చిన ఆరుగురు వ్యక్తులను అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకుని మంగళవారం జరిమానా విధించారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కాశగూడెం గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు వలలతో దుబ్బతండాకు వేటకు వచ్చారు. పక్కా సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు దాడిచేసి వలలు, ఆరు బైకులు స్వాధీనం చేసుకున్నారు. అటవీ ప్రాంతంలో వేట నిషేధించబడిందని, ఈ మేరకు ఆరుగురు వ్యక్తులకు రూ.66 వేలు జరిమానాను విధించారు. వేట చట్టరీత్యా నేరమని ఫారెస్ట్ రేంజ్ అధికారి పర్వేజ్‌అహ్మద్, అధికారులు రేణుక, లలిత పేర్కొన్నారు.

విద్యుత్ మోటార్ల వైర్లు చోరీ

కోడేరు, మార్చి 26 : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని పస్పుల, ఎత్తం గ్రామ శివారులోని పొలాల్లో 21 మంది విద్యుత్ మోటార్ల రాగి వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. పస్పుల గ్రామ శివారులో పెద్ద కొత్తపల్లి మండలం దేవునితిర్మలాపూర్‌కు చెందిన ఏడుగురు రైతులు కేఎల్ఐ కాల్వలో సాగునీటి సరఫరా కోసం విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. మోటార్లు అమర్చిన ఏడు మంది రాగి వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఎత్తం శివారులో బీమా కాల్వలో 14 మంది రైతుల విద్యుత్ మోటార్ల వైరును దొంగిలించారు. ఈ విషయంపై ఆయా గ్రామాల రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం

అమ్రాబాద్, మార్చి 26 : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం బీకే లక్ష్మాపూర్‌తండాలో మంగళవారం విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధమై భారీగా ఆస్తి నష్టం సంభవించింది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాలో కొర్ర శ్రీనుకు చెందిన గుడిసెలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురైంది. గుడిసెలో విలువైన డాక్యుమెంట్లు, వంట సామగ్రి, దుస్తులు, బంజారా నాణేలు, ఇతర వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయని బాధితుడు శ్రీను వాపోయాడు. మంటలు వ్యాపించగా అమ్రాబాద్ నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు రూ.ఐదు లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించిందని వారు తెలిపారు.

మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి హుండీ లెక్కింపు

» రూ.16 లక్షల ఆదాయం

అమ్రాబాద్, మార్చి 26 : నాగర్ కర్నూల్ జిల్లా పదర మండలం మద్ది మడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయంలో మూడు నెలలకు సంబంధించిన హుండీని మంగళవారం లెక్కించారు. హుండీ ద్వారా ఆలయానికి రూ.16 లక్షల తొమ్మిది వేల 351 నగదు రాగా, 1,650 గ్రాముల మిశ్రమ వెండి వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి రంగాచారి విలేకరులకు వివరించారు. కార్యక్రమంలో డివిజన్ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అభయుడి హుండీ ఆదాయం రూ.7.94 లక్షలు

ఊర్కొండ : మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం హుండీ లెక్కించినట్లు ఈవో సత్యచంద్రారెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా హుండీ ఆదాయం రూ.7,94,344 వచ్చినట్లు తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని బ్యాంకులో జమ చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వరలక్ష్మి, శ్రీశైలం, రవికుమార్, అర్చకులు మహేష్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, శ్రీనివాసశర్మ, దత్తాత్రేయశర్మ, గ్రామస్థులు మనోహర్‌రెడ్డి, అంజయ్యగౌడ్, రవీందర్ సాగర్, సంగప్పగౌడ్, రవీందర్‌గౌడ్, శ్రీనివాసులు, చంద్రయ్య, మల్లేష్ ఉన్నారు.

పాత లాకర్ అపహరణ

ఖిల్లాఘణపురం, మార్చి 26 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం పర్వతాపూర్‌లో వాసిరెడ్డి కుటుంబానికి చెందిన పాతకాలం నాటి లాకర్ సోమవారం అపహరణకు గురైంది. బాధిత కుటుంబ సభ్యురాలు ఇందిర తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో ఉన్న పాత లాకర్‌ను గ్రామానికి చెందిన బోయ నరేష్ అనే వ్యక్తి సోమవారం మధ్యాహ్నం బొలేరో వాహనంలో ఎలాంటి సమాచారం లేకుండా పాత ఇనుప సామగ్రికి అమ్మడానికి తీసుకెళ్లాడు. ఎవరూ దానిని కొనుగోలు చేయకపోవడంతో రాత్రివేళ తిరిగి అదే ఇంటి ఆవరణలో వదిలి వెళ్లాడు. ఈ విషయం పోలీసులకు సమాచారం అందడంతో రాత్రికి రాత్రి ఆ లాకర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రామానికి చెందిన బోయ నరేష్ తీసుకువెళ్లిన విషయాన్ని గ్రామస్థులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు గ్రామానికి చేరుకుని మంగళవారం గ్రామంలో పంచాయితీ పెట్టాలని నిర్ధారించుకున్నారు. మంగళవారం తహసీల్దార్ పాండు, పోలీసులు ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో లాకర్‌ను కుటుంబ సభ్యులకు తిరిగి అప్పగించారు. లాకర్ అపహరణపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయంపై ఎస్సై శ్రీహరిని వివరణ కోరగా.. కుటుంబ సభ్యుల కోరిక మేరకు కేసు నమోదు చేయలేదని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రాజాపూర్, మార్చి 26 : మండలంలోని ముదిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నందిగామ గ్రామ శివారు సమీపంలో ఫిల్టర్ ద్వారా తయారు చేస్తున్న ఇసుకను పట్టుకున్నట్లు ఎస్సై రవి తెలిపారు. తమకందిన సమాచారంతో కానిస్టేబుళ్లు ఘటనా స్థలానికి వెళ్లి ట్రాక్టర్, ట్రాలీని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎమ్మెల్సీ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ రవి నాయక్



ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జి. రవినాయక్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), మార్చి 26 : ఈ నెల 28న జరగనున్న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసన మండలి ఉప ఎన్నిక పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి. రవినాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మండల ప్రజా పరిషత్ కార్యాలయం (ఎంపీడీవో)లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రం వద్ద 100 మీటర్ల పరిధిలో మార్క్ చేసి బార్ కేడింగ్ ఏర్పాటు చేయాలని, పోలింగ్ కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జడ్పీ సీఈవో రాఘవేంద్ర రావు, ఆర్డీవో నవీన్ ఉన్నారు.

పోలింగ్ సిబ్బంది నియామకం

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), మార్చి 26 : లోక్ సభ ఎన్నికల సందర్భంగా మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించి పోలింగ్ సిబ్బందిని నియమించారు. మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి. రవినాయక్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాకు పోలింగ్ సిబ్బంది నియామకం కోసం మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించారు. అవసరమైన సంఖ్యలో రిజర్వ్‌తో సహా ఒక్కొక్క పోలింగ్ కేంద్రలో నలుగురు పీవో, ఏపీవో ఇద్దరు ఓపీవోలతో పోలింగ్ సిబ్బందిని నియమించి వారికి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల్లో ఉత్తర్వులు సంబంధిత పోలింగ్ సిబ్బందికి అందజేయాలని ఆదేశించారు. ఎన్నికల విధులు కేటాయిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు స్వీకరించడానికి నిరాకరించిన, లేదా ఎన్నికల విధుల్లో భాగంగా శిక్షణకు హాజరుకాకపోయినా ఎన్నికల నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఐవో సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయాలి : అదనపు ఎస్పీ

దేవరకద్ర, మార్చి 26 : లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అదనపు ఎస్పీ సురేష్‌కుమార్, ఎస్ఐ నాగన్న అన్నారు. ఓటర్లకు భరోసా కల్పించటానికి గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని కేంద్ర బలగాలతో కలిసి స్థానిక పోలీసులతో పట్టణంలో కవాతు నిర్వహించారు. ఎక్కడైనా సమస్యాత్మక ఘటనలు చోటు చేసుకుంటే వెంటనే పోలీసులకు, అధికారులకు సమాచారం అందించాలన్నారు. బలగాలు, పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంగ్లిష్ నేర్పించాలి : డీఈవో



మాట్లాడుతున్న డీఈవో రవీందర్

హన్వాడ, మార్చి 26 : ప్రతీ విద్యార్థికి ఇంగ్లిష్ చదవడం, రాయడం నేర్పించాలని డీఈవో రవీందర్ అన్నారు. మంగళవారం హన్వాడ మండల పరిషత్ పాఠశాలలో స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఈవో ప్రారంభించి మాట్లాడారు. ఎంపికైన పాఠశాలలో విద్యా వలంటీర్లు ఇక్కడ నేర్చుకున్న అంశాలను వివరించి విద్యార్థులకు నేర్పించాలని చెప్పారు. నాలుగు నెలల పాటు విద్యార్థులకు వలంటీర్లు చెప్పుతారని తెలిపారు. 2024-2025 సంవత్సరానికి సంబంధించి రిటైర్డ్ డీఈవో విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కొనసాగుతుందని తెలిపారు. మండలంలోని 15 పాఠశాలల్లో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజునాయక్, సీఎంవో బాలుయాదవ్, ఆర్‌పీ రజాక్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, వలంటీర్లు పాల్గొన్నారు.

రైతాంగ సాయుధ పోరాట యోధుడు ధర్మభిక్షం



ధర్మభిక్షం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

పాలమూరు, మార్చి 26 : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, స్వాతంత్ర్య సమర యోధుడు ధర్మభిక్షం 13వ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి బి.బాలకిషన్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ధర్మభిక్షం రాజకీయాల్లోకి వచ్చి విద్యార్థులను చైతన్యం చేశారన్నారు. ఆనాడు నిజాం నవాబు జన్మదిన వేడుకలను బహిష్కరించిన తీరు అప్పట్లో పెద్ద సంచలనమైందన్నారు. నిజాంకు వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేసి తిరుగుబాటు చేశారన్నారు. 1940లో తొలి విద్యార్థి హాస్టల్‌ను నిర్వహించడంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించి ప్రథమ వార్షికోత్సవానికి హాజరైన కొత్వాల్ రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డిని సంబోధించిన తీరును ప్రత్యేకమైందన్నారు. ఒకచేతితో దానమడుగుతూనే మరోచేతితో ధర్మం చేస్తున్న వ్యక్తి కేవలం బొమ్మనగాని భిక్షం కాదు ధర్మభిక్షం అనటంతో ఆనాటి నుంచి ఆయనపేరు ధర్మభిక్షంగా స్థిరపడిందన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎంపీగా పనిచేసిన ధర్మభిక్షం చట్టసభల్లో పీడిత ప్రజల గొంతుక వినిపించారన్నారు. కార్యక్రమంలో చాంద్‌పాషా, సత్యనారాయణరెడ్డి, ఖాజామైనద్దీన్, కె.హనుమంతు, బి.బాలరాజు, ఆంజనేయులు, గోపి పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ

నవాబ్‌పేట(మహబూబ్‌నగర్), మార్చి 26 : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 72 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కులు తహసీల్దార్ నాన్య నాయక్ లబ్ధిదారులకు అందజేశారు. తన చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఇంకా ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని కోరారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ ప్రకటించాలి : బీజేపీ

చిన్నచింతకుంట, మార్చి 26 : రైతుబంధు, రైతు రుణమాఫీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని, ప్రజల హామీలను విస్మరిస్తే ఆందోళనా కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. తహసీల్దార్ కృష్ణయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కుర్వ రమేష్, నాయకులు దశరథ్, భరత్‌భూషణ్, ఎర్ర వెంకటన్న, దాసరి చంద్రుడు, మాసన్న పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ పట్టణ కమిటీ ఎంపిక

మహబూబ్‌నగర్, మార్చి 26 : ఎన్ఎస్‌యూఐ పట్టణ కమిటీని నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ పట్టణ కమిటీపై ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా నరేశ్‌యాదవ్, నవీన్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా మహ్మద్‌అర్బాత్, మహ్మద్‌అఖిల్, కార్యదర్శులుగా యాదగిరి, జాహెదుల్లా, ప్రవీణ్‌ను నియమించారు.

మొక్కుబడిగా సామాజిక తనిఖీ

బాలానగర్, మార్చి 26 : ఉపాధి హామీ తనిఖీని అధికారులు మొక్కుబడిగా ముగించారు. 2022 మార్చి 2023 మార్చి 31 వరకు మూడు రూ.కోట్లకుపైగా పనులకు ఆడిట్ నిర్వహించగా కేవలం రూ.16వేలు మాత్రమే సామాజిక తనిఖీల్లో వెల్లడైందని తెలిపారు. మండలంలో 37 గ్రామ పంచాయతీలు ఉండగా ఒక్కో గ్రామంలో రూ.500, వెయ్యి మాత్రమే అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం వెల్లడించింది. కార్యదర్శులు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు కుమ్మక్కై మండలంలో అంతా బాగానే ఉందని సామాజిక తనిఖీ బృందం నివేదికను తయారు చేశారని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో ముసాయిదా, ఏపీడీ శ్రీసాదర్‌రావు, విజిలెన్స్ అధికారి ప్రేమలత, ఏపీవో శృతి, ఎంపీడీవో శరత్‌చంద్రబాబు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, వివిధ గ్రామాల కార్యదర్శులు, సామాజిక తనిఖీ బృందం సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

- ఓటు అవగాహనపై 5కే రన్

- ప్రారంభించిన రెవెన్యూ అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), మార్చి 26 : ఓటు చాలా విలువైనదని, ఓటు కలిగిన ప్రతీ వ్యక్తి తన ఓటు హక్కును వినియోగించుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పిలుపునిచ్చారు. అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తమ పేర్లను తప్పనిసరిగా ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని, అందుకు యువత ఫారం-6ను భర్తీ చేయాల్సి ఉంటుందని వివరించారు. ఓటుహక్కు వినియోగం, కొత్త ఓటర్ల నమోదు విషయంపై మంగళవారం జిల్లా స్టేడియం గ్రౌండ్ నుంచి కొత్త బస్టాండ్, తెలంగాణ చౌరస్తా మీదుగా ప్రధాన వీధుల గుండ 5కె రన్ (ఓటర్ అవగాహన చైతన్య ర్యాలీ) నిర్వహించారు. ఈ ర్యాలీని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ జెండా ఊపి ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పట్టణంలో స్వీప్ ఆధ్వర్యంలో (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఓటరు అవగాహన చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటు చాలా విలువైనదని అన్నారు. ప్రతీ ఓటరు ఎన్నికలో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. రాబో యే పార్లమెంట్ ఎన్నికలలో ఓటింగ్ శాతం పెంచడానికి ప్రభుత్వం తీసుకుం టున్న చర్యలలో మనమందరం భాగస్వాములు కావాలని కోరారు. ర్యాలీలో భాగంగా అందరికీ వినిపించేలా పలు నినాదాలిచ్చారు. ఓటు హక్కు, ప్రజల హక్కు, నిర్భయంగా ఓటేద్దాం ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం, ఓటేసే బాధ్యత మందరి బాధ్యత వంటి నినాదాలతో హోరెత్తించారు. స్వీప్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీధర్ సమన్ మాట్లాడుతూ ఓటర్లలో చైతన్యం తీసుకరావడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం పలు కార్యక్రమాలు రూపొందించిందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో నవీన్, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, డి.టి. రాజ్‌గోపాల్, జిల్లా పౌరసంబంధాల అధికారి పి. శ్రీనివాస్, ఎల్.డి.ఎం. భాస్కర్, ఇంటర్ విద్యాశాఖ, పాఠశాల విద్యాశాఖ అధికారులు, ఉద్యోగులు, బూత్‌లేవల్ అధికారులు, కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



5కె రన్ నిర్వహిస్తున్న జిల్లా అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు

గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకోవచ్చు

- హస్నాపూర్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం

భూత్పూర్, మార్చి 26 : ఎన్ఎస్ఎస్ ద్వారా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తెలుస్తాయని ఎన్ఎస్ఎస్ క్యాంపు ప్రోగ్రాం అధికారులు డాక్టర్ స్వరూప, రాఘవేందర్‌రెడ్డి, నిరంజన్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ కళాశాలకు చెందిన డిగ్రీ విద్యార్థులు యూనిట్-2, 4 బ్యాచులకు సంబంధించిన వలంటీర్ విద్యార్థులు నాలుగు రోజులుగా మండలంలోని హస్నాపూర్ గ్రామంలో ఎన్ఎస్ఎస్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం గ్రామంలో వలంటీర్ విద్యార్థులు శ్రమదానం కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో ఉన్న క్రీడా మైదానంలో ముండ్ల కంపను తొలగించారు. వీధులన్నీ శుభ్రం చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం యోగా మాస్టర్ జగదీశ్వర్‌రెడ్డి గ్రామ యువకులకు, వలంటీర్లకు, విద్యార్థులకు యోగా ప్రాముఖ్యత గురించి వివరించారు. యోగా చేయడం వల్ల బీపీ, షుగర్, దీర్ఘకాలిక రోగాలు నయం అవుతాయని జగదీశ్వర్‌రెడ్డి వివరించారు. అంతకు ముందు ప్రోగ్రాం అధికారులు ఎన్ఎస్ఎస్ ద్వారా గ్రామాల్లో ప్రజా సమస్యలను తెలుసుకోవడమే కాకుండా భవిష్యత్‌లో ఏదైనా ఉద్యోగాలకు వెళ్లినప్పుడు ఈ అనుభవాలు ఎంతగానో ఉపయోగపడుతాయని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు నిరంజన్‌గౌడ్, జగదీశ్వర్‌రెడ్డి, యువకులు, వలంటీర్లు పాల్గొన్నారు.



హస్నాపూర్‌లో శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఓట్లు అడిగే హక్కు బీఆర్ఎస్‌కు లేదు

- టీపీసీసీ అధికార ప్రతినిధి వినోద్‌కుమార్

మహబూబ్‌నగర్, మార్చి 26 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిగ్గులేకుండా గోవాలో ప్రజాప్రతినిధులతో క్యాంప్ రాజకీయాలు చేస్తూ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి వినోద్ కుమార్ అన్నారు. పదేళ్లుగా స్థానిక ప్రజాప్రతినిధులకు ఎలాంటి గౌరవం ఇవ్వని బీఆర్ఎస్ ఇప్పుడు ఏం ముఖం పెట్టుకుని వారి ఓట్లను అడుగుతున్నా రని ప్రశ్నించారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లు పట్టించుకున్న పాపాన పోలేదని, ఎమ్మెల్యేల ఇంటికి ప్రజాప్రతినిధులైన కౌన్సిలర్లు, ఎంపీటీసీలు వెళితే వారిని కనీసం పలకరించిని పాపాన పోలేదని, ఇప్పుడు కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు గోవాలో కూర్చుని క్యాంప్ రాజకీయాలు చేయడం దుర్మార్గమన్నారు. ఇవన్నీ మరిచిపోయి ఇప్పుడు వారిని ఎలా ఓట్లు అడుగుతారన్నారు. ఎంపీటీసీలకు ఎక్కడా కూర్చోవడానికి కుర్చీలేదని గుర్తు చేశారు. ఎలాంటి అభ్యర్థిని పోటీలో పెట్టారని, మీ అభ్యర్థి రియల్‌ఎస్టేట్, బ్రోకర్ దందాలు చేశారని, రౌడీషీట్ ఉందని, ఆయన బాధితులు ఎంతో మంది ఉన్నారని తెలిపారు. క్యాంప్ రాజకీయాలకు తెరతీయడం సిగ్గుచేటని, మచ్చలేని నాయకుడు మా అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి అని, ఆయన భారీ మెజారిటీతో గెలువబోతున్నారని స్పష్టం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులు మీరంతా ఆత్మగౌరవంతో జీవించాలంటే మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఇన్నాళ్లు బిల్లులు ఇవ్వకుండా ఎన్ని రకాలుగా ఇబ్బంది పెట్టారో గుర్తు చేసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధుల గౌరవం పెరగాలన్నా, జిల్లా అభివృద్ధి చెందాలన్నా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు సీజే బెనహర్, సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్ యాదవ్, మల్లు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధికారప్రతినిధి వినోద్‌కుమార్

ఓటమి భయంతోనే కాంగ్రెస్ ఖాతాల ఫ్రీజ్

- టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్‌అక్తర్

మహబూబ్‌నగర్ : కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణ చూసి ఓటమి భయంతో బీజేపీ కాంగ్రెస్ పార్టీకి చెందిన బ్యాంక్ అకౌంట్లను ఫ్రీజ్ చేసిందని టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్‌అక్తర్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుట్ర పూరితంగా పార్టీకి చెందిన 11 బ్యాంక్ అకౌంట్లను ఫ్రీజ్ చేయడం దుర్మార్గమన్నారు. ఎన్నికలో కాంగ్రెస్ పార్టీని ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేయాలన్న లక్ష్యంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఆ కుట్ర పూరిత రాజకీయాలకు తెరతీసిందని ఆరోపించారు. ఎలక్టోరల్ బాండ్‌ల పేరుతో బీజేపీ ప్రభుత్వం పెద్ద స్కామ్ చేసిందని విమర్శించారు. బీజేపీ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని బలపరచాలని ప్రజలు నిర్ణయించారన్నారు. నాయకులు సీజే బెనహర్, మల్లు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న మోదీ ప్రభుత్వం

- మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), మార్చి 26 : అన్నివర్గాల అభ్యున్నతికి నరేంద్ర మోదీ ప్రభుత్వం పని చేస్తోందని భారతీయ జనతాపార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. మంగళవారం పట్టణంలోని హన్మాన్‌పూర్, అబీబ్ నగర్ పరిధిలోని ఖాన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మైనారిటీ మహిళల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సబ్‌కసాత్, సబ్‌కావికాస్ అనే నినాదంతో మోదీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు. త్రిపుల్ తలాక్ రద్దుతో ముస్లిం మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతోందని అన్నారు. ముస్లిం ప్రజలకు ఎప్పటికీ బీజేపీ వ్యతిరేకం కాదని ఆమె స్పష్టం చేశారు. బీజేపీ అమలుచేస్తున్న ప్రతీ సంక్షేమ పథకంలో అర్హులైన ప్రతీ ముస్లిం ప్రజలకు చేరుతున్నాయన్నారు. హిందూ, ముస్లిం భాయి భాయి అన్న నినాదాన్ని మనమందరం గట్టిగా నమ్మితేనే సంతోషంగా ఉంటామని విరించారు. ప్రపంచంలోని చాలా దేశాలు మోదీ పాలనను ఆదర్శంగా తీసుకుంటున్నాయని అన్నారు. దేశం మరింత అభివృద్ధి జరగాలన్నా, పాలమూరు అభివృద్ధి జరగాలన్నా బీజేపీకి ఓటు వేసి తనను గెలిపించాలని డీకే అరుణ కోరారు. ఈ సమావేశంలో మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎం.డి. ఫారుక్‌తో పాటు సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

మద్దిగట్లలో ఈదమ్మ బోనాల పండగ

- వేడుకలకు హాజరైన కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

భూత్పూర్, మార్చి 26 : గొర్రె పొట్టేళ్ల తేరు, పోతురాజుల విన్యాసాలు, ఒగ్గు కళాకారుల నృత్యాలు, గోండు కళాకారుల డోలు విన్యాసాలు, వీధుల వీధుల వెంబడి డీజే పాటలతో యువకుల డ్యాన్సులు అబో ఒక్కటేమిటి జిల్లా ఏగ్రామంలో జరగని విధంగా ఓగ్రామంలో హోలీ పండుగ సందర్భంగా ఊరంతా ఏకమై నాలుగు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. మండలంలోని మద్దిగట్ల గ్రామంలో చాలా ఏళ్లగా హోలీ పండుగ రోజు నుంచి నాలుగు రోజుల పాటు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేస్తారు. ఆటపాటలతో ఊరంతా మార్మోగేలా వైభవంగా జరుపుకుంటారు మంగళవారం సాయంత్రం ఈదమ్మ, పోచమ్మ దేవతలకు ప్రత్యేక బోనాలను సమర్పించారు. అదే విధంగా రాత్రి సమయంలో గ్రామానికి చెందిన కదిరె శేఖర్‌రెడ్డి ఇంటి నుంచి ప్రత్యేకంగా తయారు చేయించిన గొర్రెపొట్టేళ్ల తేరుతో ఒగ్గు కళాకారులు, వరంగల్లు డోలు కళాకారులు, పోతురాజు విన్యాసాల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, అదే విధంగా బీఆర్ఎస్, బీజేపీల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు,

గోప్లాపూర్‌లో తీజ్ వేడుకలు

భూత్పూర్ : మునిసిపాలిటీలోని 3వ వార్డులోని గోప్లాపూర్ గ్రామంలో మంగళవారం గిరిజనులు తుల్జాభవాని అమ్మవారి తీజ్ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గిరిజనులు తుల్జాభవాని మాతకు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారిని ఇంటి ముందు ప్రత్యే కంగా ఏర్పాటు చేసిన (పాల్) డేరాలో ప్రతిష్ఠించి పూలు, పండ్లు, మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. బుధవారం తెల్లవారు జామున అమ్మవారికి హారతి ఇచ్చారు.

అయ్యవారిపల్లిలో బొడ్రాయి వేడుకలు

మిడ్జిల్(మహబూబ్‌నగర్) : మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలోని 3వ వార్షిక బొడ్రాయి వేడుకలను మంగళవారం గ్రామ మాజీ సర్పంచ్ సునీతానర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని బొడ్రాయి వద్ద అభిషేకం, హోమంతో పాటు పలు పూజా కార్యక్రమాలను అర్చకులు దిలీప్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం మహిళలు బోనాలతో వెళ్లి నైవేద్యం సమర్పించారు. బంధువులు రాకతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమలో కృష్ణయ్య, ఆంజనేయులు, శ్రీను, రామకృష్ణ, ఆంజనేయరెడ్డి, వెంకటయ్య, జంగయ్య, పరంధాములు ఉన్నారు.



ఈదమ్మ తల్లికి సమర్పించడానికి బోనాలు తీసుకెళుతున్న మహిళలు



మిడ్జిల్ మండలం అయ్యవారిపల్లిలో పూజలు నిర్వహిస్తున్న గ్రామ ప్రజలు



ఎద్దుల బండ్లతో ఊరేగుతున్న భక్తులు

సాగుతున్న తిరుమలనాథ స్వామి జాతర

హన్వాడ : శ్రీ రాకమకొండ తిరుమలనా థస్వామి జాతర ఘనంగా జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకొని పూజలు చేశారు. భక్తులు స్వామి వారికి దాసంగాలు సమర్పించారు.

ఘనంగా శకటోత్సవం

నవాబ్‌పేట్ల(మహబూబ్‌నగర్) : మండలంలోని పల్లెగడ్డ ఆదిబసన్న ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కామారం, పల్లెగడ్డ, గురు కుంట, అమ్మాపూర్, నవాబ్‌పేటకు చెందిన భక్తులు స్వామివారికి ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో శకట్సోతవం నిర్వహించారు. కార్యక్రమంలో పల్లెమోని జంగయ్య, రాములు, సత్యయ్య, పోమాల బాలరాజు, నర్సింహులు, వడ్ల ఈశ్వరయ్య, పూజారి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ పూజ సామాను వేలం పాట

నవాబ్‌పేట మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ అమ్మవారి పూజ సామగ్రి విక్రయించేందుకు 2024-25 సంవత్సరానికి గాను ఈనెల 30న అమ్మవారి ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మదనేశ్వర్‌రెడ్డి, చైర్మన్ కృష్ణయ్య తెలిపారు.

ఒకటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), మార్చి 26 : ఏప్రిల్ 1 నుంచి దశలవారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు ప్రణాళికలు తయారు చేసుకున్నామని కలెక్టర్ జి. రవినాయక్ తెలిపారు. వరిధాన్యం కొనుగోల్లు, సీఎం రైస్, తాగునీరు ఇబ్బందుల విషయమై మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి అన్నీ జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మేరా ప్యాడీ క్లీనర్లు వేయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు, ఇతర సామగ్రి సన్నద్ధం చేస్తున్నామని, వేసవి దృష్ట్యా అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని, ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎన్నికల ప్రవర్తనా నియమావళి కట్టుదిట్టంగా అమలయ్యేవిధంగా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఈ విషయమై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, ఆర్డీఓ నవీన్, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్, డిఎం ప్రవీణ్, డి.పి.ఓ యాదయ్య, డి.సి.ఓ పద్మ, డిఆర్‌డిఓ నర్సింహులు, మిషన్ భగీరథ పుల్లారెడ్డి, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్, ఎంపీటీసీ

చిన్నచింతకుంట, మార్చి 26 : మండలంలోని చిన్న వడ్డెమాన్ గ్రామ సర్పంచ్ ప్రభాకర్, ఉంద్యాల గ్రామ ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణ్, నాయకులు మన్నెం, వెంకటేష్, చిన్నగౌడ్, శంకర్, గూడూరు గ్రామానికి చెందినముని, శివకుమార్ గౌడ్, మాజీ వార్డు సభ్యులతో పాటు ఆయా గ్రామాలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు మంగళవారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి స్వగ్రామమైన మండలంలోని దమగ్నాపూర్ గ్రామంలో ఆయన నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు జైపాల్‌రెడ్డి వట్టెం శివకుమార్, సురేందర్‌రెడ్డి, సత్యశీలారెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 26 : పదో తరగతి పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి జిల్లా వ్యాప్తంగా 99.57 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. మంగళవారం నిర్వహించిన భౌతిక, రసాయన పరీక్షకు మొత్తం 12,776 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 12722 మంది విద్యార్థులు హాజరు కాగా, 54 మంది విద్యార్థులు హాజరుకాలేదు. పరీక్ష కేంద్రాలను డీఈవో రవీందర్, స్క్వాడ్ బృందాలు పరిశీలించాయి.

టెట్ పరీక్ష ఫీజులు తగ్గించాలి

పాలమూరు, మార్చి 26 : తెలంగాణ ప్రభుత్వం టెట్ పరీక్ష ఫీజులను తగ్గించాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టీచర్ ఎలిజబిలిటీ టెస్ట్ ఫీజులను ఒక్కొక్క పేపర్‌కు రూ.200ల నుంచి రూ.1000లకు పెంచటం భావ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టెట్, డీఎస్సీ నోటిఫికేషన్ వేయటాన్ని స్వాగతి స్తున్నట్లు తెలిపారు. టెట్ పేపర్-1 దరఖాస్తు ఫీజు రూ.200లు, రెండు పేపర్లకు రూ.300లు ఉండేది, దానిని నేడు టెట్ పేపర్ -1కు రూ.1000లు, పేపర్-2కు రూ.1000లు చేయటంతో నిరుద్యోగులపై భారం పడుతోందన్నారు. గతంలో ఉన్న ఫీజులనే ఈ ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సమాజ్ సభ్యులు రఘు, సాయి, నరసింహ, గోపాల్, ఓంప్రకాష్, చిన్నారెడ్డి, భగవంతు, ఏఎస్‌డబ్ల్యూవో ఉమాపతి, వెంకటయ్య పాల్గొన్నారు.

'స్థానిక అవసరాలకు అనుమతులివ్వాలి'

మిడ్జిల్(మహబూబ్‌నగర్), మార్చి 26 : మండలంలోని పలు గ్రామాలలోని ఇళ్లు కట్టుకునేందుకు ఇసుకలేకపోవడంతో ఇంటి నిర్మాణాలను చేపట్టేందుకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని మండలంలోని పలు గ్రామాల ప్రజలకు ఇంటి నిర్మాణాలు, ప్రభుత్వ పనులు చేపట్టేందుకు అయ్యవారిపల్లి నుండి మహబూబ్‌నగర్‌కు తరలిస్తున్నా ఇసుకను అనుమతులివ్వాలని బీజేపీ, బీఆర్ఎస్, ఎంమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం వేర్వేరుగా తహసీల్దార్ రాజునాయక్, ఎస్ఐ ఆనంద్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లె తిరుపతి, బీజేపీ మండల అధ్యక్షుడు లాలు, నాయకులు రాములు, శ్రీనివాసులు ఉన్నారు.

'అధ్యక్ష పదవిని ఉప సంహరించుకోవాలి'

గండీడ్, మార్చి 26 : బీజేపీ మండల కమిటీ ఎన్నికపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు ప్రభు నాయక్ అన్నారు. ఇటీవల అధ్యక్ష పదవిని విజయ్‌కుమార్‌రెడ్డికి అప్పగించడంపై మాజీ అధ్యక్షుడు ప్రభునాయక్ స్పందించారు. కనీసం మండల సమావేశం నిర్వహించకుండా నూతన అధ్యక్షుని ఎన్నుకోవడం సరి కాదని మంగళవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయం ముందు మండల నాయకులు నిరసన చేశారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి కలిసి నూతన అధ్యక్షుడిని ఎన్నుకోవడం వల్ల మండలంలో విభేదాలు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రభు నాయక్, ఉపాధ్యక్షుడు బాలయ్య, మండల కార్యదర్శి కృష్ణయ్య, నరేష్, సంతోష్ నాయక్, వెంకట్రాములు పాల్గొన్నారు.